పట్టభద్రుల గొంతుకనవుతా

సమస్యలపై మండలిలో గళ మెత్తుతా • అన్ని వర్గాలకు కాంగ్రెస్ మోసం • పత్రాలిచ్చి ఫోజులు కొట్టిందెవరో.. ఉద్యోగాలిచ్చిందెవరో అందరికీ తెలుసు • గులాబీ సైనికుల దీవెనలే నా బలం

సమన్వయంతో ముందుకుపోతున్నం • వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానంపై గులాబీ జెండా ఎగరేస్తాం • బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ) : 'మారుమూల గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన. బిట్స్‌పిలానీ గోల్డ్‌మెడలిస్ట్‌ను. మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్‌లో రెండు పీజీలు చేసిన. అమెరికాలో ఏడేండ్లపాటు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగం చేసిన. ప్రజా సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న నేను పట్టభద్రుల తరపున ప్రశ్నించే గొంతుకనవుతా' అంటున్నారు వరంగల్-నల్లగొండ-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి. ఉన్నత విద్యావంతుడిగా తనను పట్టభద్రులు గుర్తించి ఆశీర్వదిస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో పోలిస్తే తానే బెస్ట్ చాయిస్ అన్న నిర్ధారణకు వచ్చారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సరళి, పట్టభద్రుల స్పందన తదితర అంశాలను 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

శాసనమండలిలో మీరులేవనెత్తాలనుకునే అంశాలేంటి?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసింది. వాటిల్లో ప్రధానమైంది జాబ్‌క్యాలెండర్. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ, ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ ఇలా అనేక హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆర్నెళ్లు అవుతున్నా వందరోజుల్లో జాబ్ క్యాలెండర్ అనేది అమలు కాలేదు. ఈ హామీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించటం లేదు. అతిముఖ్యమైన అంశాలే కాదు సాధారణ అంశాలపైనా కాంగ్రెస్ సర్కారుకు అసలు ఎజెండా యే లేదని ప్రజలు గుర్తించారు. రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు.

ఎమ్మెల్సీ ఎన్నికలంటే ప్రచారపటాటోపం ఉండదు కదా. మరి మీ కార్యాచరణ ఎట్లా ఉంది?

నిజమే. సాధారణ ఎన్నికలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో అదీ పట్టభద్రుల ఎన్నిక విధానం పూర్తిగా భిన్నమైంది. ఈ కారణంగా ప్రతి ఓటర్‌ను కలిసి మద్దతు కోరుతున్నాం. సోషల్ మీడియాను వాడుకుంటూనే వివిధ సంఘాల ప్రతినిధులను కలుస్తున్నాం. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లను కలుస్తున్నాం. మొత్తంగా చూస్తే ఎన్నికల కమిషన్ ఫార్మాట్‌లో రిజిస్టర్ అయిన ప్రతి ఓటరును కలిసి అందరి ఆశీర్వాదం తీసుకుంటున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకర్గంలో ఇప్పటివరకు ఓటర్లతోనే సమావేశాలు నిర్వహించాం.

ఐదునెలలు కాకముందే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశాం, రెండు లక్షల ఉద్యోగాలిస్తామని కాంగ్రెస్ చెప్తున్నది కదా?

బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ నాయకత్వంలో నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎంపిక ప్రక్రియ అంతా పూర్తిచేసి నియామక పత్రాలు జారీ చేసే క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. అన్ని ప్రక్రియలు పూర్తిచేసిందెవరు? కేవలం ఉద్యోగ నియామక పత్రాలిచ్చి మొత్తం మేమే ఇచ్చామని ఫోజులు కొడ్తున్నదెవరో అందరికీ తెలుసు. తొమ్మిదిన్నరేండ్లలోనే దేశంలోనే అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది కేసీఆర్ ప్రభుత్వమన్న సంగతి ఆ ఉద్యోగాలు చేస్తున్నవారికి, వారి కుటుంబాలకు తెలుసు. కేసీఆర్ ప్రభుత్వమిచ్చిన ఉద్యోగాలను తాము భర్తీ చేశామని చెప్పడమే కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం.

ప్రచారంలో పట్టభద్రుల స్పందన ఎలా ఉంది?

చాలా అద్భుతంగా ఉంది. బరిలో ఉన్న మూడు రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి బెస్ట్ చాయిస్ అనే అభిప్రాయం పట్టభద్రుల్లో కనిపిస్తున్నది. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఎంపిక విషయంలో ఆ పార్టీలోనే ఏకాభిప్రాయం లేదు. మల్లన్న వ్యవహారశైలి, నోటిదురుసు ఇతరేతర అంశాల కారణంగా కాంగ్రెస్‌లోనే ఆయనపై తీవ్ర వ్యతిరేకత ఉన్నది. ఇక బీజేపీలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఆ పార్టీలో అసలు అభ్యర్థిగానే గుర్తించటం లేదు. కాబట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉన్నట్టు కనిపిస్తున్నా అంతర్గతంగా బీఆర్ఎస్‌కే సానుకూల పరిస్థితి ఉన్నది. మూడు ఉమ్మడి జిల్లాల్లో ఇప్పటికే 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాం. పూర్తి స్థాయిలో పట్టభద్రులైన ఓటర్లు హాజరై నన్ను దీవిస్తున్నారు. ఈ మూడు జిల్లాలు తెలంగాణ ఉద్యమానికే కాకుండా సాయుధరైతాంగ పోరాటానికి, వామపక్ష, ప్రగతిశీల భావజాలానికి పెట్టనికోటలు. ఈ కారణంగానే నాలుగు సార్లు బీఆర్ఎస్ ఇక్కడ విజయం సాధించింది. ఐదోసారి ఆ చరిత్ర పునరావృతమవుతుందనే విశ్వాసంతో ఉన్నా.

బీఆర్ఎస్ అభ్యర్థిగా మీకు కలిసివచ్చే అంశాలేంటి?

పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా సమస్త గులాబీ సైనికుల దీవెనలే నా బలం. పార్టీలో ప్రతి ఒక్కరూ తామే అభ్యర్థులుగా భావించి నా గెలుపుకోసం కష్టపడుతున్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. మాతృభూమికి సేవ చేయాలనే నేను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చా. ప్రజా సమస్యలు, తెలంగాణ, భారతదేశ ఆర్థిక స్థితిగతులపై నాకు సంపూర్ణ, సమగ్ర అవగాహన ఉన్నది. 'ప్రగతి రథచక్రాలు', 'ఫిస్కల్ ఫెడరలిజం', 'ద డాన్ ఆఫ్ న్యూ ఎరా', 'తెలంగాణ ఎకానమీ' వంటి పుస్తకాలు రాశా. సివిల్స్ కోచింగ్ తీసుకునే విద్యార్థులకు గెస్ట్ లెక్చర్లు ఇచ్చా. 'ఈ-క్లాసెస్' అనే ఫ్రీ కోచింగ్ యాప్ రూపొందించి ఉచితంగా ఉద్యోగార్థులకు అందుబాటులోకి తెచ్చిన. ఇవన్నీ నాకున్న ప్రాథమిక అర్హతలుగా భావిస్తున్నా. నేను రాజకీయాల్లోకి వచ్చి తక్కువ కాలమే అయినా, నా వ్యక్తిగత కార్యదక్షతకు పార్టీ బలంతోడై నన్ను ముందుకు నడిపిస్తున్నది.

భద్రాద్రి జిల్లా కొత్తగూడెం ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని పరిచయం చేస్తున్న కేటీఆర్



భద్రాద్రి జిల్లా ఇల్లెందులో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పట్టభద్రులు

రేవంత్.. ఎన్ని ఉద్యోగాలిచ్చావ్?

- **2 లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే**
- **కాదని నిరూపిస్తే రాజీనామాకు నేను సిద్ధం**
- **రాష్ట్రంలో ఇప్పుడున్నది మోసాల ప్రభుత్వం**
- **విద్యావంతుడికి, బ్లాక్ మెయిలర్ మధ్యే పోటీ**
- **బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**
- **ఖమ్మం జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం**

ఖమ్మం, మే 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/సత్తుపల్లి: ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారక రామారావు నిలదీశారు. ఆరు నెలల్లో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండా, ఇంటర్వ్యూలు చేయకుండా ఉద్యోగాల భర్తీ ఎలా సాధ్యమో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించినట్టుగా రెండు లక్షల ఉద్యోగాలు ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కల్పించినట్టు నిరూపిస్తే రాజీనామా చేసేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నదని మోసాల కాంగ్రెస్ ప్రభుత్వమని, ప్రజలను మోసం చేయడం దానికి అలవాటేనని దుయ్యబట్టారు. ఇకపై మోసపోకుండా పట్టభద్రుల ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను ఓటేసి శాసనమండలికి పంపుదామని పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తమ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో ఎంతగానో శ్రమించిందని గుర్తుచేశారు. దానిని అనుకున్నంతగా ప్రచారం చేసుకోలేకపోయామని చెప్పారు. అరచేతిలో వైకుంఠం చూపెట్టి, అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఈ నెల 27న జరిగే ఉమ్మడి ఖమ్మం-వరంగల్- నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం కేటీఆర్ విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాలకు అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వాన్ని సవాల్‌చేసే శక్తి కలిగిన, పట్టభద్రుల సమస్యలపై అవగాహన కలిగిన రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు. విద్యావంతుడైన బీఆర్ఎస్ అభ్యర్థికి, బ్లాక్ మెయిలర్ అయిన కాంగ్రెస్ అభ్యర్థికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎవరి పక్షం ఉండాలో పట్టభద్రులు ఆలోచించుకోవాలని కోరారు. ఆరు నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలనూ మోసం చేశారని విమర్శించారు. ప్రజలు మోసపోవడానికే ఇష్టపడతారన్న సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పట్టభద్రులు పరిగణనలోకి తీసుకుని తమ ఓటును ఆయుధంగా మలిచి ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు.

ఉమ్మడి ఖమ్మాన్ని అభివృద్ధి చేశాం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధిగా చిరునామాగా తీర్చిదిద్దామని కేటీఆర్ గుర్తుచేశారు. రూ.వేల కోట్ల నిధులతో ఇల్లెందును అభివృద్ధి చేశామని, కొత్తగూడేన్ని జిల్లా కేంద్రంగా చేసి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశామని, సింగరేణిలో 24 వేల వారసత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనతను పొందామని చెప్పారు. కానీ అక్కడ బడే భాయ్.. ఇక్కడ చోటే భాయ్ కలిసి పారిశ్రామికవేత్త అదానీ కోసం సింగరేణి తలుపులు బార్లా తెరిచారని ఆరోపించారు. అందుకని ఈ శాసనమండలి ఎన్నికల్లో ప్రశ్నించే గొంతే కావాలని అన్నారు. విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డి గెలిస్తే తెలంగాణ పట్టభద్రుల ఆత్మగౌరవం పెరుగుతుందని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. 56 కేసుల్లో నిందితుడిగా ఉండి 74 రోజులు జైల్లో ఉన్న బ్లాక్‌మెయిలర్ ఎమ్మెల్సీగా ఎన్నికైతే ఏం జరుగుతుందో పట్టభద్రులే అర్థం చేసుకోవాలని కోరారు. ఫీజు లేకుండా పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డి.. టెట్ ఫీజులను రూ.400 నుంచి రూ.2 వేలకు పెంచారని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి, 2 లక్షల మందికి ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వంటివి అమలుకావాలంటే.. వాటి గురించే ప్రశ్నించే ఉన్నత విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డి గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

రాకేశ్‌రెడ్డి ఆశయం గొప్పది: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మక బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్ చదివి గోల్డ్ మెడల్ సాధించి ఆమెరికాలో ఉద్యోగం చేస్తున్న రాకేశ్‌రెడ్డి.. తెలంగాణ ప్రజలకు సేవ చేసేందుకే వచ్చారని చెప్పారు. ఆయన ఆశయం ఎంతో గొప్పదని అన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న చరిత్ర ఏమిటో తెలంగాణ ప్రజలందరికీ తెలుసునని అన్నారు. సభల్లో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బానోతు మదన్‌లాల్, ఖమ్మం, మహబూబాబాద్ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బిందు, బీఆర్ఎస్ నేతలు కొండబాల కోటేశ్వరరావు, దండిగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ 'రాయల' కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

డీసీఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత రాయల వెంకట శేషగిరిరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న కేటీఆర్ సోమవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. రాయల శేషగిరిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు. రాయల పార్టీకి ఎనలేని సేవలు అందించారని, ఆయన అడుగుజాడల్లో నడవడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. పార్టీ ఎల్లప్పుడూ రాయల కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కరెంటు కోతలపై ఎన్నికలకు ముందే చెప్పాం: కేటీఆర్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కరెంటు కోతలపై ఎన్నికలకు ముందే స్పష్టంగా ప్రజలకు చెప్పామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు గుర్తుచేశారు. కాంగ్రెస్ కావాలా, కరెంటు కావాలా? తేల్చుకోండని ఎన్నికల ప్రచారంలోనే చెప్పామని సోమవారం ఎక్స్ వేదికగా తెలిపారు. మార్పు మార్పు అన్నారని, 2014 కంటే ముందటి చీకటి రోజులను కాంగ్రెస్ వాళ్లు మళ్లీ తెచ్చారని పేర్కొన్నారు. 'మీరు (కేటీఆర్) అధికారంలో నుంచి వెళ్లారు. మా ఇంట్లో నుంచి కరెంటు పోయింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కరెంటు సరఫరా పరిస్థితి దయనీయంగా ఉంది.' అని శివ అనే వ్యక్తి ఎక్స్‌లో పేర్కొంటూ కేటీఆర్‌కు ట్యాగ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో కరెంటు కోతలపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తరుణంలో సామాన్య వ్యక్తి శివ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన అభిప్రాయంపై కేటీఆర్ ప్రతిస్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే మోసాలను సమర్థించినట్టే!

- **పట్టభద్రులు రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి**
- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

దేవరకొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చందంపేట, మే 20: కాంగ్రెస్‌కు ఓటు వేయడమంటే వారి మోసాలను బలపర్చడమే అవుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్‌నాయక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. హరీశ్‌రావు ప్రెస్ మీట్ ప్రారంభిస్తుండగానే దేవరకొండలో కరెంటుపోయింది. దాంతో 'ఇదీ రేవంత్ పాలన' అంటూ ఆయన కాంగ్రెస్ సర్కారుకు చురకలంటించారు. ఉద్యోగ కల్పన విషయంలో వంట అంతా వండి పెట్టాక.. వడ్డించినట్టు కాంగ్రెస్ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. మహిళలకు స్కూటీలు, నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల డీఏలు.. రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మేధావులు, రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలన తీరుపై ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారకాంక్షతోనే కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. బడి పంతుళ్లపై లాఠీచార్జీ చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొద్దు నిద్రపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లేపాలంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.

డయాగ్నస్టిక్ కేంద్రాలపై ఇంత నిర్లక్ష్యమా?

కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 36 డయాగ్నస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 134 రకాల వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకొచ్చి వైద్యసేవల్లో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపింది. లక్షలాది నిరుపేద, సామాన్య ప్రజలకు ఆర్థిక భారం లేకుండా చేసి, నాణ్యమైన వైద్య పరీక్షలను అందించిన డయాగ్నస్టిక్ కేంద్రాలు ఇప్పుడు నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి. ప్రజారోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డయాగ్నస్టిక్స్ కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు, సిబ్బందికి ఆరు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి. డయాగ్నస్టిక్ కేంద్రాల ద్వారా అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలు ప్రజలకు అందే విధంగా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం

- ఎక్స్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

ఏ బ్రాండ్‌లు ఉంటాయో ఏమో!

- **'లిక్కర్ బ్రాండ్ల ప్రమోషన్'పై వ్యాపార వర్గాల్లో చర్చ**
- **బ్రాండ్‌లు మారితే.. తిప్పలేనంటున్న మద్యంప్రియులు**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో అనధికారిక మద్యం పాలసీకి తెరతీసిన ప్రభుత్వ పెద్దలు.. తమ పథకాన్ని దశలవారీగా అమలు చేయాలనుకుంటున్నట్టు తెలిసింది. దీంతో ఇక నుంచి తెలంగాణలో ఏయే మద్యం బ్రాండ్లు ఉంటాయో, ఏవి కనుమరుగవుతాయో.. కొత్తగా ఏం వస్తాయో తెలియని స్థితి నెలకొంది. వారం పదిరోజులుగా కొన్ని లిక్కర్ బ్రాండ్‌లు మద్యం షాపుల్లో అందుబాటులో లేకపోవడంతో మద్యంప్రియులు ఆందోళన చెందుతున్నారు. తమకు అలవాటైన బ్రాండ్లనే ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. వేరే బ్రాండ్ల మద్యం తాగేందుకు మనసొప్పడం లేదని వాపోతున్నారు. కొత్త మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టేందుకు ఎలాంటి పరిమితులు లేకపోవడంతో ప్రభుత్వ పెద్దలు తమ పథకాన్ని సులువుగానే అమలు చేయనున్నారని సమాచారం.

ఆరోపణలపై నోరు మెదపని పెద్దలు

మద్యం సప్లయర్స్‌లో ఒకరైన ఓ మంత్రి తమ్ముడు 'కొత్త కమీషన్ దందా'లో చక్రం తిప్పుతున్నట్టు సమాచారం. మద్యం వ్యాపారుల్లో కొత్త బ్రాండ్ల ప్రమోషన్‌పై విపరీతమైన చర్చ జరుగుతున్నా.. ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి తమ్ముడు, మంత్రి స్పందించకపోవడం ఆరోపణలకు బలం చేకూర్చుతున్నది. అనధికారిక మద్యం పాలసీలో ఏడాదికి సుమారు రూ.5వేల కోట్లకు పైగా డబ్బులు వెనకేసుకుందామని భావిస్తున్న ఆ ప్రభుత్వ పెద్ద ఎవరనే దానిపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చ జరుగుతున్నది. దీనిపై ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం కొరత లేకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇన్నాళ్లు పెండింగ్‌లో పెట్టిన ఇండెంట్లను క్లియర్ చేసే పనిలో పడ్డారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనే భావనతో ఓ అడుగు వెనక్కి వేసినట్టు సమాచారం.

- **అమెరికాలో పంటల సాగుపై వేముల పరిశీలన**

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా కాలిఫోర్నియాలోని వెస్ట్ మానిటలీ గ్రామంలో బ్రకోలి పంట సాగు తీరును పరిశీలించారు. 150 ఎకరాల్లో డ్రిప్, బెడ్ సిస్టమ్‌లో పూర్తి ఆటోమైజేషన్‌తో కేవలం నలుగురు రైతులు సాగుచేస్తున్న పంటను పరిశీలించారు. ఆటోమైజేషన్ సిస్టమ్‌తో సాగు చేయడం రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని, సమయం, ఖర్చు ఆదా అవుతాయని, దిగుబడులు కూడా పెంచుకునే అవకాశం ఉంటుందని వేముల తెలిపారు.

-వేల్పూర్

పేదోడి ఇంటిపైకి బుల్డోజర్

- **బీఆర్ఎస్‌కు ఓటు వేశారని దాడి**
- **కౌన్సిలర్ భర్త ప్రోద్బలంతో సోదరుల మధ్య తగాదా**
- **కొల్లాపూర్ నియోజకవర్గంలో ఘటన**

మహబూబ్‌నగర్, మే 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ క్యాడర్‌పై, సానుభూతిపరులపై కాంగ్రెస్ నేతలు నిత్యం వేధింపులకు దిగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక గులాబీ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడుతున్నారు. సోమవారం కొల్లాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నేత, పాస్టర్ నర్సింహ ఇంటిపై దాడి జరిగింది. ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఉన్న ఫ్యామిలీ గొడవ స్థానిక కౌన్సిలర్ భర్త ప్రోద్బలంతో తగాదా మరింత ముదిరింది. ఇద్దరి మధ్య ఉన్న స్థల వివాదం కోర్టులో ఉండగానే.. కౌన్సిలర్ భర్త పేదోడి ఇంటిపైకి బుల్డోజర్‌ను తీసుకొచ్చి గోడతోపాటు రేకులను కూలగొట్టారు. బాధిత కుటుంబ సభ్యులు అడ్డుకోవడానికి యత్నించినా వారు వినలేదు. ఇదంతా ఒకటో వార్డు కౌన్సిలర్ భర్త చెప్పుచేతల్లో జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. తమపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని నర్సింహ వాపోయాడు. దాడి చేయడంతో పాటు తిరిగి తమపైనే అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

అన్నదమ్ములది సివిల్ పంచాయితీ..

ఇది సివిల్ పంచాయితీ.. అన్నదమ్ముల ఆస్తి గొడవ కోర్టులో నడుస్తుంది. దీనిపై పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ ఉంది. నరసింహ పోలీసుల ప్రమేయం వద్దని కోర్టు నుంచి తీసుకొచ్చారు. ఇది సివిల్ దావా అయినందున మేము జోక్యం చేసుకోలేదు. గొడవ జరుగుతుందని తెలిస్తే పోలీసులను పంపించాం. ఆ తర్వాత ఇరు వర్గాలు పిటిషన్లు ఇచ్చాయి. ఈ పిటిషన్‌లన్నీ మామూలు గొడవలే కాబట్టి ఎఫ్ఐఆర్ చేయలేదు. ఈ వ్యవహారంలో మాపై ఒత్తిడి ఉన్నదన్న ప్రచారంలో నిజం లేదు.

- రిషికేశ్, ఎస్సై, కొల్లాపూర్

మంత్రికి ప్రమేయం లేదు

మంత్రికిగానీ.. నాకు గానీ ఎలాంటి ప్రమేయం లేదు. ఇది అన్నదమ్ముల పంచాయితీ.. మా వార్డులో గొడవ జరుగుతుందని తెలిసి అక్కడికి వెళ్లాను. అప్పటికే ఇద్దరి మధ్య పంచాయతీ నడుస్తుంది. కావాలని మాపై బురద జల్లుతున్నారు. నరసింహ ఇంటిని కూలగొట్టడానికి మాకు ఎలాంటి సంబంధం లేదు.

- పినిశెట్టి శేఖర్, వార్డు కౌన్సిలర్ భర్త

దౌర్జన్యంగా కూలగొట్టారు

నేను కొనుగోలు చేసిన ఇంటిపై కోర్టులో కేసు నడుస్తుండగా జేసీబీ తీసుకొచ్చి కూలగొట్టారు. మంత్రి కనుసన్నల్లోనే కౌన్సిలర్ భర్త దగ్గరుండి చేశారు. 12 ఏండ్ల కిందట మా అన్నయ్యతో పాత ఇ